# జార్జెట్ చీర

శ్రీ పంగనామముల వెంకటేశ్వర ప్రసాదరావు

౧

"ఎప్పుడూ మీ గొడవేనా మా సంగతేమైన..." అంటూ గదిలోకి వచ్చింది పద్మ-చంకన పిల్ల నేసుకుని.

"ఏమిటే నీ పాడుగోల పొద్దస్తమానమూను... కాసేపు రాసుకోనివ్వవు గద. నాచాకిరికి తగిన ట్లే నీ దెప్పుడూను..."

అంటూ కలం బల్లమీద పెట్టాడు రావు పద్మ వైపు జూస్తూ.

"లేకపోతే ఏమిటండీ ఆపాడురాత. పెళ్లాంతో మాట్లాడటానికి గూడ తీరుబడి లేకపోయె. ఇంక చెప్పండి మనం, మనసంసారం మన దాంపత్యం అడుక్కుతిన్నట్లే ఉన్నది.అందరి సంసారాలు యిల్లాగే అఘోరిస్తున్నాయా ఏమిటి?"

అని చంకనున్న పిల్లను బల్లమీద కూర్చోపెట్టింది.

"బలేదానివి మొత్తానికి. పిల్లను తీసుకుపోరాదూ కాగితాలన్నీ చింపుతుంది. తర్వాత ఏమనుకున్నా ఏం లేదు. అందులో మరోటీ మరోటికూడా కావు. ఆఫీసు కాగితాలు."

"తీస్తాను కాని...మరి..."

"ఏమిటే నీ నస."

"జ్ఞాపకం లేదూ..."

"ఏమిటో చెప్పరాదు త్వరగా..."

"ఈనెల జీతంలో నాకు చీర తెస్తానన్న మాట ఏమయింది..."

"అదా... చంపావు మొత్తానికి.... ఎక్కడు జ్ఞాపకమే...."

"ఝాను జ్ఞాపక ముండదు మరీ......"

"ఇవ్వి బాగానే జ్ఞాపక ముంటాయి" అని మొహం అటు త్రిప్పుకున్నాడు.

"చెప్పరేం?" (కొంచెమాగి) "అహ...... జవాబురాదుగా! దీని కింక నోరు పడిపోతుంది. మా మూలేగా మీకు."

"ఏమిటామాటలు? ఎలా మాట్లాడాలనో తెలియదు గద! ఎన్ని ఏళ్లు నెత్తిన బడితే నేం? పందికి ఉన్నాయి నీకు ఉన్నాయి సంవత్సరాలు.

—అందుకనే చదువుకున్న పెళ్లాం కోసం తపించా. కాని ఏంలాభం. అన్యథా జరిగింది. ఇంతకూ ఇప్పుడనుకుంటే ఏముంది అంతా అయినాక.

—చెబితే, గ్రహించుకునే తెలివితేటలయినా ఉండాలి. లేక, తోచనయినా తోచాలి. రెండు లేకపోతేఎలా ?"

"వచ్చిన జీతం తిండికే జరగటం అంతంత మాత్రంగా ఉంటుంటే, ఎప్పటికప్పుడిలాగే అవుతుంటే యింక ఎప్పుడు చెప్పండి? మీరుకొనటం, నేను కట్టుకోవటం రెండూ నిజమే...ఇంకా నాబ్రతుకిలా తెల్లవారాల్సిందేకదా. ఇంతకూ దేనికయినా పెట్టిపుట్టాలి. ఇలాంటి మొగుడ్ని చేసుకున్నందుకు అన్నిటికి..."

"ఏం ఏడుస్తావు లేవే...అవునుగాని వచ్చే నెలకు వాయిదా వేయరాదూ. ఈనెలలో యింటి పన్ను కట్టాలి పదహారు రూపాయలు."

"ఎప్పుడూ యిలాగే ఏదోఖర్చువస్తుంది. అన్నట్లు మా అక్కయ్య పిల్లలు వస్తామన్నారు, రేపు పండుగకు. వాళ్లు వచ్చినా రాకపోయినా నాకు చీర తీసుకరావల్సిందే.

—నా కాశ్చర్య మేస్తుంది, పక్కింటివారమ్మాయి సుభద్ర ఎప్పుడూ ఏదో చీరకొంటునే ఉం

టుంది. నాకర్మం కాల ఏడాదికో చీర తెప్పించు కుందామన్నా యింతవరకు పడలేదు. పాడగాపాడగా గాని ఏవస్తువూ రాదు.

ఎందుకు...మనిషికి నీతి ఉండాలి. అది లేక పోయినాక ఎంత మొత్తుకుంటే మట్టుకు...ఏమిటో లెండి. అడిగడిగి నా ప్రాణం విసిగిపోతుందికాని మీ కేం..."అని కన్నీళ్లు పెట్టింది. పాపం రావుకి జాలి వేసింది. హృదయంకటిగి స్రవించింది. ఒక్కనిట్టూర్పు నాసాపుటలనుంచి వెలువడింది.

కుర్చీమీదనుంచి లేచి పద్మమెడమీద చెయ్యి వేసి సోఫామీదకు తీసుకెళ్లాడు.

"రా, పద్మ కూర్చో"అని తాను కూర్చుని పద్మ చెయ్యిపట్టుకుని బలవంత పెట్టాడు.

"ఎందుకేం?...నామాట వినని..."

"చీర తెస్తాగా."

"నిజం"

"నిజంగా ముమ్మాటికీ"

"చేతిలో చెయ్యి వెయ్యండి"

"వేస్తా కూర్చోమరి..." అని పద్మను కూర్చో పెట్టాడు రావు.

"సరే గాని, నీవు చెప్పిన ఉప్పాడచీరలో ఏరకం? తెముల్చు వేగం."

"కాఫీరంగులో, ౧౨౦-వ నెంబరు. పమిట చెంగున జానెడు వెడల్పున జల్తారు గూడ ఉంటుంది" అని అంటూ అతని నేత్రద్వయం వైపు కొంటెగా జూచింది, తన కనుదమ్ములనుంచి ఆహ్వానాన్ని తొణికిస్తూ.

ముఖారవిందం మీద తెలినవ్వు దొంతరలు నృత్యం సల్పినాయి.

ఆశ్చర్యంగా "చంపావు ... అలాంటి చీర కట్టటానికి నీ మనసెలా అంగీకరిస్తుందే...ఉల్లిపొర లాంటి ఆచీర కట్టడానికి నీవేం సానిదానివా"

"ఐతే...వాళ్లకే నన్నమాట అర్హత...అంతేనా"

"అది కట్టుకుని వీథిలోకి వెళ్తావా" అన్నాడు. ఆశ్చర్యం, భయం, సంశయం మూర్తీభవించినాయి అతనిలో.

పద్మ కొంచెమాగి చిఱునవ్వు నవ్వుతూ

"ఏం వెళ్తే......"

"ఓసి నీ...అది కట్టుకుని బయటికి వెళ్తే నాకు అపర్దిష్ట ఫలాని ఆయన పెళ్లాం..."

"పోనీ లెండి, మీ రలాంటి అపర్దిష్ట పాలవటం ఎందుకు కాని నే నాచీరతో వీథిలోకి వెళ్లను లెండి. మీ కలాంటి భయ మనవసరం".

"ఆ చీరతో బయటికి పోయినట్లు నాకు తెలిస్తే మర్నాడు నే నాచీర చింపిపారేస్తా. తర్వాత ఏమనుకున్నా ఏం లాభంలేదు."

"సరే......యింకేం......"

"సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ తెస్తా... అవును గాని మరి నాకు ఒక... ము ...ద్దు." అని దగ్గరకు లాక్కున్నాడు.

"ఇప్పుడు గదు. సాయంత్రం చీరకట్టుకుని ముస్తాబయి అ...ఫు...డు..." అని గిరుక తిరిగిపారి పోయింది.

## ౨

సాయంత్రం ౫ గంటలయింది. ఆఫీసునుంచి రావు బజారుకు వెళ్లాడు కొట్లన్నీ గాలించటానికి.

షుమారు, ౧౦, ౧౫ దుకాణాలు వెతికాడు. ప్రతిచోటా ౨౦, ౩౦ చీరలు పడేశారు. అన్నీ ఉల్లిపొర కాగితాల్లాగు ఉన్నాయి. చేతిలో పట్టుకుంటే చినిగిపొతా యేమో అన్న భయం కూడ కల్గింది. చిఱుగాలులకు రెపరెపలాడుతూ శరీరంమీద గుడ్డంతా ఒక్కమారు రివ్వున ఎగిరిపోయే టట్లున్నాయి.

చీరలు వివిధరంగులలోవి చూడగానే పొంగి బోర్లా పడ్డాడు. కాని ఒక్క క్షణం లోనే మరల అసహ్యం జనించింది. వాటిమీద. ఆ ముద్దుసుసు చీరలు భార్య కట్టుకుంటె తనివి తీరజూచి ఆనంద పడాలని ఒకవైపూ, వేరొకవైపు అవి కట్టుకున్నపుడు యితరు లేమైన జూచి అనుకొని పోతారేమో అన్నభయం— యీ రెంటిమధ్య బడితారుమా రయినాడు. ఈ డైలమా నుంచి తప్పించుకునేవిధ మేమిటా అని మనిషి గాభరా పడ్డాడు.

మనస్సు జంజాటనలో పడింది. ఏ పాపులోనూ ఎటూ తేల్చుకో లేకపోయినాడు. చాలా ఆర్భాట పడ్డది హృదయం. ఒక నిశ్చితాభిప్రాయానికి రాలేక పోయాడుత్వరగ. చీరలు తీసుకుపోతే ఒక అవస్థ. తీసుకు వెళ్లకపోతే మరో అవస్థ.

ఇద్దరు ముగ్గురు దుకాణాదారులు గూడ, ఇలాంటి చీరలు మీకు బాగుండ వన్నారు. ఈ ఉల్లిపొర కాగితం లాంటిచీరలు పైపై మెఱుగే అనీ, ఇంతకన్న స్వల్పపు ఖరీదుకు కొత్తరకం చీరలు మంచి డాబైన రంగులలో, గ్యారంటి యిచ్చే రంగులలో వస్తూన్న వనీ, వాటినే ఎక్కువ మీ బ్రాహ్మణకుటుంబాలు వాడుతున్నా రనీ దుకాణా దారులు తెల్పారు.

అంతా అలా అంటుంటే తనకు హృదయం మారింది. మొదట్లో ఆమెతో పట్టుకొస్తా నని చెప్పి చివరకు వేరొకవిధంగా ప్రవర్తిస్తే యింక మూతి బిగించుకుని, అలిగి కూర్చుంటుందేమో నని తోచింది. అంతేగాదు మరో అఘాయిత్యపు పనికి గూడ ఉపక్ర మిస్తుందేమో! చీర తీసుకురానంత మాత్రం చేత యింక ఏడుపులు, పస్తులు, ఉపవాసాలు యిలాంటివి ఎన్ని, యింక చెప్పటానికి వీలులేదు. మరీ కోపిష్టి దైతే బావిలో పడతానని కూర్చుంటుంది.

ఐతే అలాంటి అధ్వాన్నపు బ్రతుకుమాత్రం కాదు. మన రావుది. అంత భయంకర రాక్షసిగాదు రావు భార్య. మొత్తంమీద, యితను మొదటినుంచి చనువివ్వ టంవల్ల నెత్తెక్కి కూర్చున్నదని మాత్రం చెప్పాలి. ఇతని మంచితనాన్ని దుర్వినియోగ పరచుకున్న వ్యక్తి. ఆవిడలో నిర్లక్ష్యత, కోపం, ఉన్నై. ఎన్నిసార్లు రావు మాటలతో మందలించినా తన అదిరిపాటుతనాన్ని సర్ది పుచ్చుకోలేదు. పశ్చాత్తాపపడటం అనేది ఎఱుగదా యిల్లాలు.

తన మనస్సు అంగీకరించకపోవటం వల్ల ఏచీరా లేకుండా ఉత్త చేతులతో వెళ్లితే యింక బుంగ మూతి పెట్టుకుని కూర్చుంటుందనుకొని, ఏ యితరచీరఅయినా తీసుకుపోవాలని నిశ్చయించాడు. ఏ యితర చీర అయినా అయితే నచ్చుతుందా? మళ్లీ కొట్టుకు తిరిగి రావల్సి వస్తుందేమో అని యీ రెండింటితో తర్జనభర్జన పడ్డాడు కాసేపు.

ఎలాగయితేనేం మరోరకంచీరలు గాలించాడు. అంటేపెద్ద పెద్దగళ్ల అంచు చీరలు లుంగీ గళ్ల చీరలు. వందేమాతరం చీరలు లాంటివి. ఇవి కట్టుకుంటే తన నేత్ర ద్వయాని కందంగా కనిపించినవా రెంతమందో ఉన్నారు.

కాని ఆ గళ్లచీరలు కట్టుకుంటే తన భార్యలో బ్రాహ్మణత్వం పాడైపోతుందేమోనని తోచింది. వాటి ప్రమేయంగూడ విరమించాడు.

పోనీ యీ వెధవరంగు చీరలు గళ్లచీరలు కన్న శుభ్రంగా మల్లెపూవులాగు తెల్లగా ఉంటాయి; పైగా కొద్దిలో వస్తాయి అని గ్లాస్కో చీరలు గాలించాడు. పద్మ యిదివరకు అవన్నీ కట్టివిడిచేసినవే. కాని తనకు ఎఱ్ఱ అంచుమీద మోజు. తన భార్య గూడ అంగీక రిస్తుందని తెలుసు. కాని ఆ అంచువి ఏ కొట్లోను లభించలేదు. ఎప్పుడోకాని అవి రావనీ, వచ్చినా పదికట్టలలో ఏ ఒకటో రెండోఉంటాయనీ, అవి అప్పుడే ఖర్చవుతాయనీ కొట్లవాళ్లు తెల్పారు.

చివర కది అంతంత మాత్రమే అయింది. పాపం నిరాశాహతు డైనాడు. ఎటూ తోచలేదు. సాయంత్రం ౫ గంటల కొచ్చిన మనిషి దాదాపు ౭ దాటింది. అంతవరకు కొంప జేరలేదు. పెళ్లాం మీద మోజుకొద్దీ శ్రమపడ్డాడు.

వ్రాసుకోవలసిన ఆఫీసుకాగితాలు చాలా ఉన్నా యన్న సంగతి జ్ఞప్తికి వచ్చింది. రకానికి ౪ చీరలు చొప్పున ఒక పెద్దమూట కట్టించుకుని కొంప జేరాడు. వేరే రెండు చీరలు గూడ కట్టించు కున్నాడు.

పద్మ వాకిట్లో నిల్చున్నది పిల్లను చంకనుపెట్టు కుని-శీతమయూఖుని మందలిస్తూ. తలంటిపోసుకున్న దీర్ఘశిరోజాల వేణీభరం లోని పాయలు నడుముమీద నృత్యం సల్పుతున్నాయి.

రావు ప్రత్యక్షం కావటంతోనే చిరునవ్వు దొంతరలు ఎఱ్ఱని గులాబి పెదవులపై తొణికిసలాడి నాయి అప్రయత్నంగా.

"ఈ మాటంతా నాకే" అని పట్టలేని ఆనందంతో గబగబ లాక్కుంది.

"ఆ! నీకె" అన్నాడు విసుగ్గా.

"ఎందుకండి అంతకోపం......

మీకష్టం వృథాపోదు లెండి ..." అనేసి ఆ మాట చేత్తో పట్టుకుని రివ్వున పాటిపోయింది లోపలికి లేడిపిల్లలాగు—

* * *

## 3

మరుసటిదినం ఆదివారం. మధ్యాహ్నం భోజనా లయినాయి. పద్మ,రావు లిర్వురూ తమలపాకు కిళ్లీలు నములుతూ తాపీగా కూర్చున్నారు.

అంతలో పద్మ రుసరుసలాడుతూ "ఏమిటండి! నా మొహం ఆచీరలూ, అడుక్కు తిన్నట్లున్నాయి... మీరు రసజ్ఞులేమో అనుకొన్నా. ఇంతేనా మీ రసజ్ఞత. మీమరద లేమో—ఊ—మెచ్చుకుంటుంది మీకు చీరల నాణ్యం బాగా తెలుసునని. ఇదేనా ఎన్నిక—

మరదలు పొగడనూ బావ పొంగిపోనూ క్రిందా పైనా బడి. ఇర్వురికి కలిసింది అంత. అదీ ముఖ్యమైన మాట. ఎంతసేపటికీ పొరుగింటి పుల్లకూర రుచి. దాని కెవరేం జేస్తారు? పెళ్లాం ఎంత అందంగా ఉన్నా నచ్చదు.

పోయి ఉండండి కులాసాగా మీ మరదలు దగ్గర. మీకు హాయి, నాకు హాయి.

పెళ్లాం కట్టుకుంటే జూచి సహించే ఘటం కావద్దూ ముందు. పెళ్లాం ఎంత రంభగా ఉంటే నేం."

"అబ్బ యిప్పుడు ఆ వెధవ సాదింపు లన్నీ దేనికి? ఆ చీరలు నచ్చకపోతే మరోటి తెస్తాను వెళ్లి"

"అమ్మయ్య! ఇప్పుడు నోరు పెకిలింది. ఎలాగయిన మాఆయన హృదయం......"

"మరి యింకెందుకు కుళ్లి చస్తావు..."

"కుళ్లీ చస్తే బాగానే ఉండును. అది లేకపోబట్టే. నాచావు ఎప్పుడు వస్తుందా అని మీరు చూస్తున్నారు. మీకన్న నాకు తొందరగానే ఉన్నది ఈ వెధవ సంసారం చేయలేక"

"అబ్బ! యిప్పుడా కుంటిమాట లన్నీ దేనికి. నీకీ చీరలు నచ్చలేదన్నావు ... అలా అయితే వెనుక నీవు కోరిన చీరకాదు గాని మరోటి తెస్తాను కట్టుకో".

"నాకు నచ్చుతుందా"

"ఆ. ముమ్మాటికి ... మరి వెనుకటి వాగ్దానం ప్రకారం ఆ చీరతో బయటికి పోగూడదు."

"దీనికి కావాలి ఆ వాగ్దానం?"

"ఆ"

కాసేపు సణిగి ఊరుకుంది.

"నే చెప్పినట్లు చేస్తానంటె ఆచీర తెస్తా"

"ఏమిటో తేల్చండి వేగం"

"వాల్మీకి రామాయణం నెత్తిన పెట్టుకుని "ఈ చీరతో నేను వీథిలోకి వెళ్లను" అని చెప్పాలి."

"హు...ఏం మనిషండి మీరు ... మీ పాడు ముండ అనుమానమే మిమ్మలను యింత జేస్తున్నది. కాపరాని కొచ్చి ౫ సంవత్సరా లయింది. ఇంకా మీకు నామీద..."

"ఆవిషయం వేరు. నీవు ఏ పని చేసినా, ఏ గుడ్డ కట్టినా నా ఆనందం కోసమేనా? నన్ను తృప్తిపరచటాని కేనా? ఏమంటావు?"

ఒక్క నిట్టూర్పు విడిచి

"అవును అంతె" అన్నది పద్మ.

"అలాంటప్పుడు నే చెప్పినట్లు చేస్తా నని అనటానికి ఎందుకు నోరురాదు.

నా మర్యాద, నా ఆనందం, నా ఆత్మ సంతోషం నీకు కావాలి. అంతేగాని పరపురుషులూ, పరస్త్రీలూ వీరి నిమిత్తం గాదు. నీవు ఏపని జేసినా భర్త హృదయాని కనుగుణంగా ప్రవర్తించటం, అతని ఇచ్ఛ ప్రకారం నడుచుకోవటం, అతన్ని పూజించటం— యివీ మన హైందవస్త్రీధర్మాలు.

మన పవిత్రమైన ఆర్యసంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించిన స్త్రీ ఎన్నటికి స్త్రీ కాదు.

ఆమె నేమనాలనో నాకు నోరురావటంలేదు."

అతని మాటల కడ్డువచ్చి పద్మ—

"ఇంక చాలిద్దురూ మీపుణ్యమా అని" అన్నది.

"వెధవ చీర తెమ్మన్నానని ఎంత పెంట పెట్టారండీ. నిజంగా మీరూ మగవాళ్లంటె. మీ కిష్టంలేని పని నే నెందుకు జేయాలి. మీరు చెప్పినట్లె నే నా చీరతో వాకిట్లోకి వెళ్లను. భగవానుని సాక్షిగా ఆ ముక్క చెబుతున్నాను. నమ్మండి."

"ఆమాట మీదనే నిలుస్తావా?"

"ఆ. ముమ్మాటికి."

"అలా అయితే తీసుకో." అని ఆక్కడ నుంచి లేచి డ్రాయరు దగ్గర కెళ్లి ఉలిపిరి కాగితంలో నున్న చీరమడతను తెచ్చి పద్మ కందిచ్చాడు.

ఆనందకందళితహృదయారవిందయై పద్మ ఆదుర్దాతో అందుకుని అతనివైపు ఒయ్యారంగా జూచి

"అమ్మ, దొంగ! చీర తెచ్చేనా నన్నిలా వేపటం...నే నంటే పాపం మా ఆయన కాపేక్ష" అని అక్కడే గబగబా ఆకాగితం విప్పి

"అమ్మయ్యా! జార్జెట్‌చీరే! ఎలా అయినా మా ఆయనకు చీరలు ఎంచడం బాగా తెలుసు. అందుకనే మరదలు అంతగా పొగడుతుంది" అని ఆ చీరను ముద్దెట్టుకుని గట్టిగా తన వక్షాని కదుముకున్నది.

"మరి నాకో..." అన్నాడు రావు.

"సాయంత్రం ముస్తాబయి ... " అని కొంటెతనంగా అతని వైపు చూచి గెంతులేసుకుంటూ పారిపోయింది లోపలికి-

* * *

సాయంత్రం ౫ గంట లయింది. రావు తన వేషధారణం పూర్తి గావించుకుని పడకకుర్చీలో పడుకున్నాడు. నిమిషాలు లెక్కపెడుతున్నాడు పద్మకోసం.

ఇంతలో జోళ్లచప్పుడు వినిపించింది. గబగబ బల్లమీద నున్న "పవిత్ర వారపత్రిక" తీసుకుని పేజీలు తిరగేయటం మొదలెట్టాడు.

పద్మ వెనకగా వచ్చి వారపత్రిక లాక్కుంది అతని చేతుల్లోనుంచి.

"ఒహో! అయిందీ వేషధారణం."

దీర్ఘవినీలవేణీభరం వక్షోజాల మీద పడవైచుకుని చెవులమీద జుట్టు సర్దుకుంటూ నిలబడ్డది.

చిరునగవు మొలకలు ఆమె పెదవులపై తొణికిసలాడినాయి. అరవిరిసిన నేత్రద్వయం నుంచి ఆహ్వానాన్ని అందజేస్తూ

"ఏం ఎలాగున్నాను. నచ్చానా మీకంటికి" అని నునుసిగ్గు అభినయిస్తూ అతని చెంపమీదకు చెయ్యి విసిరింది.

రావు కుర్చీలో నుంచి లేచి పద్మ దగ్గర నిల్చొని మెడ మీద చెయ్యివేసి గోడకున్న నిలువుటద్దం ఎదుటికి తీసు కెళ్లాడు.

ఇద్దరు అద్దంలో తమ్ము తాము చూచుకుంటూ శిలాప్రతిమల లాగు ఉండిపోయారు.

"పద్మ! నీవు యదార్థంగా గం...ధ...ర్వాం..గ...నవు." అని కౌగిట్లోకి లాక్కున్నాడు.

"ఈవిషయాలలో నీవుఅర్హకురాలవుకాదుగా"

"మీరు మాత్రం మహా అసమర్థులా. మీకష్టం వృథాకాదు లెండి" అన్నది వినపడి వినపడనట్లు అతని బుజం మీద వ్రాలి.

నవవవోన్మేషమైన భువనమోహన సౌందర్యంతో ఆధునికాంధ్రయువతీయువకు లిద్దరు రతీదేవి మన్మథుల్లాగు నిల్చుండి పోయారు ఒకరికౌగిట్లో ఒకరు.